తమాషా

విజయ్

ఎదురుగుండా గోడమీది గడియారం గంటలు కొట్టడం ప్రారంభించే సరికి ఉలిక్కిపడి తలెత్తి చూసాను. ఎనిమిది. బయటికి చూసాను చిరాగ్గా. యింకా ఓ పది మంది పేషెంట్లున్నారు.

కనీసం ఈ రోజైనా అన్నమాట తప్ప కూడదు. వెధవది నెల్లాళ్ళనుంచి ప్రయత్నిస్తున్నా శ్రీమతి కోరిన చిన్న కోరిక తీర్చ లేకపోతున్నాను. ఈరోజు తప్పకుండా తీరుస్తానని మాట యిచ్చాకనే బయట అడుగు పెట్టనిచ్చింది ఉదయం. అది గుర్తొచ్చి మరో పావుగంటలో అందర్నీ పంపేశాను. కంపౌండరుతో చెప్పి బయట అడుగు పెడుతున్నంతలో బయటనుంచి విమానంలా దూసుకొని వచ్చింది ఒక అమ్మాయి. వస్తూనే అక్కడున్న బెంచీమీద కూలబడి రొప్ప సాగింది. సుమారు యిరవై ఏళ్ళుంటాయి.

'ఏమిటి ?' నా కంఠంలో ఎన్నడూలేని విసుగు నన్నే ఆశ్చర్యపరచింది.

మాట్లాడలేకపోతున్నదామె. చివరికి పడిపోతున్న కనురెప్పలెత్తి 'విషం' అంది బొటన వేలితో మంచినీళ్ళు కావాలన్నట్టు చూపిస్తూ.

ఒక్కక్షణం నాకేమీ అర్థమవలేదు. బుర్రంతా తెల్లని కాగితంలా బ్లాంక్‌గా తయారయింది. వెంటనే మెరుపులా ఓ ఆలోచన వచ్చింది. బహుశా ఈమెకెవరేనా విషమేదైనా యిచ్చివుండచ్చు. దాన్ని చెప్పడానికి అలా సంజ్ఞచేసిందేమో అన్పించింది.

కంపౌడరుని పిల్చి తొందరగా 'స్టొమక్ వాష్' కోసం ఎరేంజ్ చెయ్యమనిచెప్పి పల్సు చూసాను. వేగంగా కొట్టుకుంటున్నాది! త్వరగా స్టొమక్‌వాష్‌చేసి హాస్పిటల్‌లో వున్న ఒక్క బెడ్ ఎలాట్‌చేసి 'ఈమెకేం పర్వాలేదు ఏమైనా కావలిస్తే యింటికి ఫోన్‌చెయ్యి.' తని నర్సుతోచెప్పి బయటపడ్డాను.

* * *

ఒకరోజు మామూలుగా సాయంత్రం కాలేజీనుంచి యింటికొచ్చింది సుబ్బలక్ష్మి. గేటుతియ్యగానే గుమ్మంలో హీరోలా నిలబడిన రాజారావును చూసింది. చూడగానే అతను రాజారావని, తరవాత కాలంలో అతను విసిరిన వలలో తను పడుతుందని అప్పటికి తెలీదామెకి పాపం!

సాయంసంధ్యలా హుందాగా నడిచివస్తున్న సుబ్బలక్ష్మినే చూస్తున్నాడు రాజారావు.

సుబ్బలక్ష్మికి అసహ్యమనిపించింది. పశువులా అలా చూస్తాడేం తినేసినట్టు. అయినా యితనెవడు ఎటునుంచి చుట్టం. ఎందుకొచ్చాడు అని మనసు అప్పుడే ఆరాతీయడం మొదలెట్టింది. సుబ్బలక్ష్మి మెట్లెక్కుతుంటే ఆమెను ఏడిపించాలనిపించింది రాజారావుకి.

'ఎవరు మీరు ? ఏం కావాలిక్కడ ?' అని నిలదీశాడు.

ఆ ప్రశ్నవిని స్థంభించిపోయింది సుబ్బలక్ష్మి. తమ యింటి మెట్లెక్కుతుంటే అలా ప్రశ్నిస్తే ఏమనిచెప్తుంది. అయినా ఈ ఇల్లు తనదన్నట్టు మాట్లాడుతున్నాడేమిటీ?

'ఏం ఈ వూరికి కొత్తగా వచ్చారా మీరు?' అని అడిగి లోపలికి దారితీసింది.

'మరేం అలా వూరొకసారి చూపించరూ!' వెనకనించి వచ్చిన మాటవిని వెనక్కి తిరిగింది చివాలున. అతని పెదవుల నుంచి చిరునవ్వు జాలువారుతోంది. కళ్లలో చిలిపితనం గంతులేస్తుంది.

'ఛ ఛ మాట్లాడ్డం నాదే తప్పు' అని లోపలి కెళ్లిపోయింది.

'అమ్మా...అమ్మా...'

ఎక్కడో పెరట్లో వున్నావిడ వచ్చింది 'ఏమిటే కాలేజీ నుంచి రాగానే మొదలయిందీ నీ గోల. ఆ ఫ్లాస్కులో కాఫీ వుంది తాగు' అంటూ.

'అమ్మా మనింటి కెవరయినా చుట్టాలొచ్చారా ?'

'లేదే, అయినా ఈ వేళప్పుడు వచ్చే చుట్టాలు, పక్కాలు ఎవరుంటారు ?'

'మరి ఆ గదిలో వున్నతనెవడు ?' సుబ్బలక్ష్మి కంఠంలో కోపం, ఉత్సుకత.

'తప్పే ! ఎవడు గివడు అనకు. అతను చాల మంచివాడు. వింటే బాధపడతాడు. ఈ వూర్లోనే ఏదో వుద్యోగం చేస్తున్నాడు. అతనికి మన ముందర గది అద్దె కిచ్చాము.' అని తన గొడవలో తను పడిపోయింది.

'నువ్వెప్పుడూ యింతే. ప్రతీ వెధవనీ మంచివాడు, గించివాడు అంటూ నెత్తి కెక్కించుకుంటావ్. వాడి సంగతి నీకేం

తెలుసు' అని మనసులోనే తిట్టుకుంటూ విసురుగా అక్కడి నుంచి కదిలింది సుబ్బలక్ష్మి.

నా సంగతింకా తెలియనట్టుగా వుంది. వెళ్లి 'రండీ అలా వూరు చూసొద్దాం'అంటే ఏమంటాడో. ఏమంటాడు, క్రింద మీద పడి 'అబ్బెబ్బె. ఎందుకండి ఏదో సర్దాకన్నాను. క్షమించండి అని వాళ్లబేరాని కొస్తాడు. ఈ రోజుల్లో ప్రతీ వెధవకీ యిదొక ఫేషనయి పోయింది' అనుకొని అందంగా తయారయి అతని గదికి దారి తీసింది.

సుబ్బలక్ష్మి అతని గదిలో కాలు పెట్టే సరికి అద్దంలో చూసి దువ్వుకుంటున్నాడు. శిక్కనుంచి అతని రూపం తీర్చిదిద్దిన గ్రీకు శిల్పంలా వుంది.

సుబ్బలక్ష్మి నొకసారి విచిత్రంగా చూసి 'రండి మీరొస్తారని తెలుసు. అందుకే ఎదురు చూస్తున్నా' అని కుర్చీ చూపించాడు.

'ఏమిటితను? తనొస్తానని అతనికి తెలుసా?' ఎలా తెలుసు! నా కోసం ఎదురు చూస్తున్నాడా? అంతా యింద్ర జాలంలా వుందే అనుకుంది.

ఆ రాత్రి యింటికొచ్చేసరికి మానసికంగా

తుఫాను

అతని వశమయిపోయింది సుబ్బలక్ష్మి. అతని మాటలు, చేష్టలు ఆమెను నవ్వించాయి. కవ్వించాయి. మొదటెంత విసుక్కుందో తరవాత అంత పెనవేసుకుపోయింది.

ఆ మర్నాడు కాలేజీలో ఫస్టువర్ కొత్త లెక్చరర్ రాక కోసం స్టూడెంట్సంతా ఆత్రంగా ఎదురు చూస్తున్నారు. రాజారావు అడుగుపెట్టడంతో గోలంతా అణిగింది. తలెత్తి చూసిన సుబ్బలక్ష్మి గుండెలు ఝల్లు మన్నాయి.

మూన్నెళ్ల తరవాత ఒకసారి సినిమా హాల్లో రాజారావుని, సుబ్బలక్ష్మిని పక్క పక్కన చూసినవాళ్ల అత్తకొడుకు రమణ మూర్తి సుబ్బలక్ష్మిని నిలదీసి అడిగాడు. 'ససేమిరా నిన్ను పెళ్లి చేసుకోను ఫో' అని చెప్పేసింది సుబ్బలక్ష్మి.

ఆరోజు రాత్రికి సుబ్బలక్ష్మికి ఒక కల వచ్చింది. ఆ కలలో వాళ్ల అత్తయ్య కాఫీలో ఏదో తెల్లటి పొడరు కలిపి తనకు యిచ్చి నట్టు. ఆ తరువాత తను మొహం తిరిగి పడి పోయినట్టు. ఆ తరవాత పడిపోయిన తనను రాజారావు చేతుల్లోకి తీసుకుని ఏడుస్తున్నట్టు ఉలిక్కిపడి లేచింది గాబరాగా. కళ్లు నులుము కొంది. చుట్టూ చీకటి. తన గాబరాకి నవ్వు కొని తిరిగి పడుకొంది.

ఆ సంఘటన మర్చిపోయిన కొన్ని రోజుల తర్వాత ఏదో పనిమీద పక్కవీధిలో వున్న అత్తగారింటికి వెళ్లింది. 'ఏమే పిల్లా మరీ నల్లపూసవై పోయావ్. ఎక్కడా కనిపించట ల్లేదు.' అని ఆప్యాయంగా పలకరించి ఓ కప్పు కాఫీ యిచ్చిందావిడ. అది తాగేసిన తర్వాత గుర్తొచ్చింది సుబ్బలక్ష్మికి కలసంగతి. కాఫీ కలిపినచోట చిన్న పొట్లం లాంటి కాగితం కనబడింది. అంతే..."

"నీకేం ఫర్వాలేదు భయంచేత చాలా నీరసంగా వున్నావు అంతే. అనవసరంగా ఆలో చించి బెంగపెట్టుకోకు' అని అభయహస్త మిచ్చాను సుబ్బలక్ష్మికి.

తన అజ్ఞానానికి సిగ్గుపడిపోయింది సుబ్బ లక్ష్మి. యింతకీ ఆ కాఫీలో కలిపింది తెల్లటి పంచదార. నిజంగా షి హేజ్ క్రియేటెడ్ ఎ స్టార్మ్ ఇన్ ఎ టీ కప్.

దుర్వాసనే ఎడబాటుకు కారణం...

కాల్గేట్ పరస్పర అన్యోన్యతకు కళంకం

కాల్గేట్ డెంటల్ క్రీమ్‌తో నోటి దుర్వాసనను ఆపండి...రోజంతా దంతక్షయాన్ని నివారించండి!

కాల్గేట్ 10 మందిలో 7 గురికి వెంటనే నోటి దుర్వాసనను నివారించినదని, భోజనము అయిన వెంటనే కాల్గేట్ పద్ధతిలో పళ్లు తోముకొంటే ఎక్కువ దంత క్షయమును, ఎక్కువ మందికి అరికట్టినదని దంతశాస్త్ర చరిత్రలో పూర్వము ఎప్పుడూ ప్రకటింపబడనట్లు శాస్త్ర పరీక్షలు నిరూపించేయి. ఎందుకంటే, కాల్గేట్ డెంటల్ క్రీమ్‌తో ఒకసారి పళ్లు తోముకొంటేనే 85% వరకు నోటి దుర్వాసన మరియు దంతక్షయమును కలిగించే సూక్ష్మ క్రిములు పోతాయి. ఎంత చక్కని పెప్పర్‌మెంట్ రుచి కూడ ఉంది—కాల్గేట్ డెంటల్ క్రీమ్‌తో రోజూ పళ్లు తోముకొనుటకు పిల్లలు యిష్టపడతారు! శుభ్రమైన, తాజా శ్వాసకు మరియు తెల్లగా మెరిసే పళ్లకు... ఎక్కువ మంది జనులు ప్రపంచములో ఏ యితర టూత్ పేస్ట్ కంటె కాల్గేట్‌నే కొంటారు!



పళ్ళను తెల్లగా, చిగుళ్ళను ఆరోగ్యంగా, నోటిని తాజాగా ఉంచేందుకు కాల్గేట్ టూత్ బ్రష్‌లనే వాడండి! మీ కుటుంబంలోని ప్రతివారికి అనువైన విధంగా 16 రకాలలో లభిస్తాయి!

DCG 50 TL (R)